సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 13 । ఆగస్టు । 2024



నిర్వహణ గాలికొదిలేశారు

నూజివీడులోని ట్రిపుల్ ఐటీలో నిర్వహణను ప్రస్తుత ప్రభుత్వ హయాంలో గాలికొదిలేయడంతో విద్యార్థులు గాడి తప్పుతున్నారు.

8లో ▸



గురక నివారణ ఇలా..

వర్షాకాలంలో పశువులు గురక వ్యాధి బారిన పడుతుంటాయి. దీని నివారణకు సత్వర చికిత్స అవసరమని పశు వైద్యులు సూచిస్తున్నారు.

8లో ▸



విత్తనశుద్ధితో రక్షణ

పంటల సస్యరక్షణలో మేలైన ప్రక్రియ విత్తనశుద్ధి. దీని ద్వారా తొలిదశలో ఆశించే పురుగులు, తెగుళ్ల బారి నుంచి పంటలను కాపాడుకోవచ్చు.

8లో ▸

న్యూస్‌రీల్

సీబీఎస్‌ఈ పరీక్షలు ప్రారంభం



ఆకివీడులో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఆకివీడు: సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 16 జెడ్పీ హైస్కూళ్లలో పదో తరగతి విద్యార్థులు ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో బేస్‌లైన్ టెస్టులు రాశారు. మధ్యాహ్నం 2 గంటలకు పరీక్షలు ప్రారంభమైనా ఇంటర్నెట్ సమస్యతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. మంగళవారం లెక్కలు, 14న ఫిజిక్స్, బయోలజీ, 17న సోషల్ సబ్జెక్టు పరీక్షలు రాయనున్నారు.

శాంతించిన తమ్మిలేరు



తమ్మిలేరు లాకులు

చింతలపూడి: తమ్మిలేరు శాంతించింది. సోమవారం ఏలూరు, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద ప్రవాహం కూడా తగ్గింది. ఆంధ్రా కాల్వ నుంచి తమ్మిలేరుకు గంటకు 500 క్యూసెక్కుల వరద నీరు వస్తుండటంతో ప్రాజెక్టు నుంచి అవుట్‌ఫ్లోను అధికారులు తగ్గించారు. గంటకు 160 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నట్టు తమ్మిలేరు ఇరిగేషన్ ఏఈ పరమానందం తెలిపారు. అయినా ప్రాజెక్టు వద్ద అప్రమత్తంగా ఉన్నామన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 347.58 అడుగులు ఉందన్నారు. అలాగే గోనెల వాగు వద్ద నీటిమట్టం 347.27 అడుగులు ఉన్నట్లు తెలిపారు. ముందు జాగ్రత్త చర్యలతో ప్రమాదకర పరిస్థితులు తలెత్తలేదన్నారు.

గళమెత్తిన నిర్వాసితులు



జీలుగుమిల్లిలో ధర్నా చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల అన్నీ త్యాగం చేసి అధికారుల మాట విని నిర్వాసిత గ్రామాలకు తరలివచ్చిన తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని.. న్యాయం చేస్తారా.. లేకుంటే తిరిగి మా స్వగ్రామాలకు వెళ్లిపోమంటారా అంటూ గాజులగొంది గ్రామ నిర్వాసితులు గళమెత్తారు. భూమికి భూమిగా తమకు ఇచ్చిన భూముల్లో వ్యవసాయ పనులు చేపట్టవద్దని వీఆర్వో అడ్డుకుంటున్నారంటూ సోమవారం జీలుగుమిల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు కె.నరసింహ, ఎ.రాముడు మాట్లాడుతూ తమకు జీలుగుమిల్లి మండలం పి.నారాయణపురం పరిధిలో భూమికి భూమిగా 193.67 సెంట్లు ఇచ్చారని, అయితే అక్కడ భూములు దున్నకుండా వీఆర్వో ఆపారన్నారు. కొందరు అధికార పార్టీకి చెందిన వ్యక్తులు చెప్పడం వల్లే అడ్డు తగులుతున్నారని ఆరోపించారు. న్యాయం చేయాలని కోరారు.

క్యూఆర్ కోడ్‌తో బిల్లుల చెల్లింపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ నూతనంగా విద్యుత్ బిల్లులో క్యూఆర్ కోడ్ సౌకర్యాన్ని కల్పించినట్లు ఏపీ ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎస్‌ఈ పి.సాల్మన్‌రాజు తెలిపారు. క్యూఆర్ కోడ్ ద్వారా బిల్లులను సులభంగా చెల్లించవచ్చన్నారు.

బంజరు భూములకు పట్టాలివ్వాలి



రైతులతో మాట్లాడుతున్న చలసాని

ముసునూరు: 50 ఏళ్లుగా అటవీ బంజరు భూముల్లో సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలివ్వాలని సీపీఐ రాష్ట్ర నేత చలసాని వెంకట రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వేల్పుచర్లలో పేదలు, బలహీన వర్గాల బంజరు భూముల సాగుదారులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. నూజివీడు నియోజకవర్గంలో అటవీ బంజరు భూముల్లో వేలాది మంది సాగులో ఉన్నారని, వారందరికీ పట్టాలు మంజూరు చేయాలని కోరారు. పార్టీ నేతలు చాట్ల పుల్లారావు, అబ్బూరి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

గురువులకు సర్దుపోటు

సా..గుతున్న ప్రక్రియ

- జాబితాలను చూసి కంగుతిన్న ఉపాధ్యాయులు
- తీవ్రంగా నష్టపోతున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల టీచర్లు
- పోస్టులు పెరుగుతాయని భావిస్తే.. ఉన్న పోస్టులకు కోత
- వినతులు పట్టించుకోలేదని ఆందోళన
- సర్దుబాటు కౌన్సెలింగ్‌ను బహిష్కరించిన ఫ్యాప్టో
- నిలిచిన వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ప్రక్రియ
- 17కు వాయిదా వేసిన విద్యాశాఖ



గణపవరం ఎంఈఓ కార్యాలయం వద్ద కౌన్సెలింగ్‌ను బహిష్కరిస్తున్నట్టు తెలుపుతున్న ఫ్యాప్టో నేతలు

నిడమర్రు: ప్రభుత్వ పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు వ్యవహారం వాయిదాలతో సా..గుతోంది. వర్క్ అడ్జెస్ట్‌మెంట్ విషయంలో ఉపాధ్యా సంఘాలు సూచనలు, అభిప్రాయాలు, సలహాలను రాతపూర్వకంగా అందించాయి. ఆదివారం కూటమి ప్రభుత్వానికి అనుకూల ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్సీలతో ఉపాధ్యాయ సంఘాలు సమన్వయ సమావేశం నిర్వహించగా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామని ఎమ్మెల్సీలు హామీ ఇచ్చారు. దీంతో ఆశించినట్టు సర్దుబాటు ప్రక్రియ జరుగుతుందని అంతా భావించారు. అయితే ఆదివారం రాత్రి విడుదల చేసిన టీచర్ల మిగులు జాబితాలను చూసి అందరూ కంగుతిన్నారు. జాబితాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) సోమవారం జరగాల్సిన మండల స్థాయి ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌ను బహిష్కరించింది. ఈ నేపథ్యంలో సర్దుబాటు ప్రక్రియను ప్రస్తుతానికి నిలుపుదల చేసినట్టు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ నుంచి వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ఫార్మెట్‌ను సోమవారం మధ్యాహ్నం నుంచి తొలగించారు. దీంతో సర్దుబాటు ప్రక్రియ వరుసగా మూడోసారి వాయిదా పడింది.

సర్దుబాటు రూపం మార్చిన సర్కారు

వర్క్ అడ్జెస్ట్‌మెంట్ అంటే ఒకటో, రెండో నెలలు మిగులు టీచర్లను అవసరమైన చోట తాత్కాలికంగా వినియోగించుకోవడం. అయితే చంద్రబాబు సర్కారు ఈ ప్రక్రియ రూపం మార్చేసిందని ఉపాధ్యాయులు విమర్శిస్తున్నాయి. సర్దుబాటులో బదిలీ అయిన స్థానంలో ఈ విద్యాసంవత్సరం ముగిసే వరకూ (వచ్చే ఏడాది ఏప్రిల్ 23) కొనసాగాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే సర్దుబాటును ఉమ్మడి జిల్లా యూనిట్‌గా చేపట్టనుండటంతో ఉపాధ్యాయులు చాలా దూరం వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుందని అంటున్నారు. సర్దుబాటు స్థానంలో రేషనలైజేషన్ బదిలీలు నిర్వహించాలని కొందరు కోరుతుంటే, మరికొందరు ఖాళీగా ఉన్న హైస్కూల్ హెచ్‌ఎం పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి పదోన్నతుల ప్రక్రియ చేపట్టి.. తర్వాత ఎస్జీటీల స్థానాల్లో విద్యా వలంటీర్లను నియమించాలని కోరుతున్నారు.

ఎంటీఎస్‌లకు మంగళం

గత జగన్ ప్రభుత్వంలో ప్రాథమికోన్నత పాఠశాలల్లో 3 నుంచి 8వ తరగతులకు ఆరుగురు సబ్జెక్ట్ టీచర్లను కేటాయించారు. విద్యార్థుల రోలు 98లోపు ఉన్నా, 98 కంటే ఎక్కువ ఉన్నా ఒక మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) టీచర్‌ను సర్దుబాటు చేశారు. ఈ మేరకు గతేడాది జూన్‌లో జిల్లాస్థాయిలో కౌన్సెలింగ్ నిర్వహించి 205 ఎంటీఎస్ టీచర్లను ఆయా పాఠశాలలకు కేటాయించారు. తాజా సర్దుబాటులో ఎంటీఎస్ టీచర్లను మిగులు టీచర్ల జాబితాలో చూపడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. పనిచేస్తున్న స్థానంలో కనీసం రెండేళ్లు కూడా పూర్తవకుండా మరోసారి ఉమ్మడి జిల్లాస్థాయిలో కౌన్సెలింగ్ అంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

నేతల మండిపాటు : ఉపాధ్యాయ సంఘాల ఏ ఒక్క డిమాండ్‌నూ ప్రభుత్వం పట్టించుకోకుండా సెంట్రలైజ్డ్ విధానంలో మండల, జిల్లాస్థాయి అధికారులకు సంబంధం లేకుండా పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పాత జీఓ ప్రకారం మిగులు టీచర్ల జాబితాలను ప్రదర్శించారు. దీంతో కూటమి ఎమ్మెల్సీలతో భేటీని ప్రభుత్వం ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదంటూ ఉపాధ్యాయ సంఘాల నేతలు మండిపడుతున్నారు.

అసలుకే ఎసరు

ప్రస్తుత సర్దుబాటు జాబితాలో ప్రాథమిక పాఠశాలల్లో 21 రోలు ఉన్నా ఇద్దరిలో ఒక్క టీచర్‌ను మిగులు పోస్టుగా చూపించడం, యూపీ స్కూళ్లలో సబ్జెక్ట్ టీచర్లను మిగులుగా చూపించడతో ఉపాధ్యాయ వర్గాలు అయోమయంలో పడ్డాయి. దీంతో పోస్టులు పెరుగుతాయని భావిస్తే ఉన్న పోస్టుల్లో కోత పడిందంటూ ఆందోళన చెందుతున్నారు. విద్యాశాఖ జాబితాల్లో అన్ని మండలాల్లో అవసరమైన టీచర్ల కంటే మిగులు టీచర్లు భారీగా ఉన్నారు. ఉదాహరణకు గణపవరం మండలంలో అవసరమైన టీచర్లు నలుగురు మాత్రమే.. అయితే మిగులు టీచర్లు 26 మంది. అంటే 22 మందికి బదిలీ తప్పదన్నమాట. 117 జీఓ రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో నారా లోకేష్ హామీ ఇచ్చారని.. విద్యాశాఖ మంత్రిగా ఇప్పుడు జారీ చేసిన ఉత్తర్వుల్లో జీఓ రద్దు చేయకపోగా 3,4,5 తరగతులకు ఎస్జీటీలను సర్దుబాటుకు పంపి, అక్కడ ఉన్న స్కూల్ అసిస్టెంట్‌లను 6 నుంచి 10 వరకు ఉన్న హైస్కూళ్లకు పంపే ఆలోచన చేయడం దారుణమని ఉపాధ్యాయ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

కౌన్సెలింగ్‌ను బహిష్కరిస్తున్నాం



పాఠశాల విద్యాశాఖ సోమవారం చేపట్టిన పని సర్దుబాటు ప్రక్రియ అసంబద్ధంగా ఉంది. ఉపాధ్యాయ సంఘాలు చెప్పిన ఏ అంశాన్నీ పరిగణనలోకి తీసుకోకుండా, ఏకపక్షంగా ప్రక్రియను చేపట్టారు. దీంతో సోమవారం మండల స్థాయిలో చేపట్టిన సర్దుబాటు కౌన్సెలింగ్‌ను ఫ్యాప్టో బహిష్కరిస్తున్నట్టు ప్రకటించింది.

– ఎల్.సాయి శ్రీనివాస్, చైర్మన్, ఫ్యాప్టో

15 వరకు అభ్యంతరాల స్వీకరణ



విద్యాశాఖ విడుదల చేసిన జాబితాలపై అభ్యంతరాలను ఈనెల 15 వరకూ స్వీకరిస్తాం. 16న తుది జాబితా ప్రకటించి ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు 17న సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేసేలా కృషి చేస్తాం. సర్దుబాటుతో అన్ని పాఠశాలల్లో నిబంధనల ప్రకారం నూరు శాతం పోస్టులు భర్తీ చేయడమే లక్ష్యం.

– నబ్బిత నర్సింహమూర్తి, కోశాధికారి, ఏపీ ఎంఈఓల సంఘం

అసంబద్ధంగా సర్దుబాటు

భగ్గుమన్న ఉపాధ్యాయ సంఘాలు



భీమవరంలో డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

భీమవరం: ఉపాధ్యాయుల పని సర్దుబాటు ఉత్తర్వుల్లో అసంబద్ధ విధానాలను సవరించాలని ఫ్యాప్టో ఆధ్వర్యంలో సోమవారం డీఈఓ జి.నాగమణికి వినతిపత్రం అందజేశారు. స్థానిక డీఈఓ కార్యాలయంలో పని సర్దుబాటుపై ఫ్యాప్టోలోని ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటుచేసిన సందర్భంగా నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు జీవో 53 ప్రకారం పని సర్దుబాటు చేయాలని, పని సర్దుబాటులో సీనియర్‌కి వెళ్లిన అవకాశం కల్పించాలని, సీనియార్టీలో ప్యానల్‌ను పరిగణనలోనికి తీసుకోవాలని, పని సర్దుబాటును మండలం లేదా డివిజన్ స్థాయికి మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఏ మేనేజ్‌మెంట్‌కు ఆ మేనేజ్‌మెంట్‌లోనే సర్దుబాటు చేయాలని, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పోస్టులను రోల్‌తో సంబంధం లేకుండా అదనంగా అలాగే కొనసాగించాలని, హైస్కూళ్లలో పది సెక్షన్‌లు దాటితే రెండో హిందీ, పీఎస్ పోస్టులను కేటాయించాలని కోరారు. డీఈఓ నాగమణి మాట్లాడుతూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సంఘాల నాయకులు విజయ రామరాజు, రామభద్రం, కేవీ రామచంద్రారావు, పీఆర్‌వీఎస్ సాయి వర్మ, జి.ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రం.. వేడుకలకు సిద్ధం



స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రంలో ఈనెల 17 నుంచి వరుసగా వేడుకలు జరుగనున్నాయి. ఏడాది పొడవునా ఆలయంలో తెలిసీ, తెలియక జరిగిన తప్పుల ప్రాయశ్చిత్తం నిమిత్తం ఈనెల 17 నుంచి 20 వరకు పవిత్రోత్సవాలను నిర్వహించనున్నట్టు ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. 17న అంకురార్పణ, 18న పవిత్రాధివాసం, 19న పవిత్రావరోహణ, 20న మహా పూర్ణాహుతి వేడుకలను నిర్వహిస్తారు. ఆయా రోజుల్లో సుప్రభాత సేవ మినహా మిగిలిన సేవలను రద్దు చేస్తున్నట్టు చెప్పారు. అలాగే ఈనెల 27న శ్రీకృష్ణ జయంతిని పురస్కరించుకుని ఆలయంలో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నామని, 28న సాయంత్రం క్షేత్రంలో ఉట్ల పండగ, స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ నెల 30న ఆఖరి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయ అనివేటి మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

కోళ్ల వ్యర్థాలను వినియోగిస్తే చర్యలు

ఏలూరు(మెట్రో): చేపల చెరువుల్లో కోళ్ల వ్యర్థాలను వినియోగిస్తే క్రిమినల్ చర్యలను తీసుకుంటామని ఏలూరు కలెక్టర్ కె.వెట్రి సెల్వి హెచ్చరించారు. భీమడోలు మండలం పెదలింగంపాడు గ్రామంలో సోమవారం ఘంటా మోహనరావు, లంక నాని అనే ఇద్దరు మూడు లారీల్లో కోళ్ల వ్యర్థాలను చేపల చెరువులకు తరలిస్తున్నారనే సమాచారంతో భీమడోలు తహసీల్దార్‌ను కలెక్టర్ అప్రమత్తం చేశారు. లారీలను సీజ్ చేసి సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు రెవెన్యూ, పోలీసు, మత్స్య శాఖ అధికారులతో కూడిన మండల బృందం మెరుపు దాడి చేసి భీమడోలు రైల్వే గేటు వద్ద కోళ్ల వ్యర్థాలతో ఉండి గ్రామానికి వెళుతున్న మూడు లారీలను సీజ్ చేసి మోహనరావు, నానిలపై కేసులు నమోదు చేశారు. లారీల్లో పట్టుబడిన కోళ్ల వ్యర్థాలను భీమడోలు డంపింగ్ యార్డ్‌లో పూడ్చి పెట్టినట్టు భీమడోలు తహసీల్దార్ చెప్పారు.

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజల నుంచి అందే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమంలో అర్జీలు స్వీకరించారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 186 అర్జీలు స్వీకరించినట్టు కలెక్టర్ తెలిపారు. జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి కేసీహెచ్ అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, వయో వృద్ధుల సంక్షేమ అప్పిలేట్ ట్రిబ్యునల్ సభ్యుడు మేళం దుర్గాప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితం చిత్తు

కలెక్టర్ నాగరాణి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి, వేదికపై ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి

భీమవరం: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం భీమవరం విష్ణు కళాశాల ఆడిటోరియంలో జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నష ముక్త్ భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మత్తు పదార్థాలతో ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని, విద్యార్థుల భవిష్యత్‌కు ఆటంకం కలుగుతుందని అన్నారు. జిల్లాలో మత్తు పదార్థాలను సమర్థంగా అడ్డుకుంటున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ మత్తు పదార్థాల కేసులు నమోదైతే బయటకు రావడం కష్టమని అన్నారు. అనంతరం మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం అంటూ విద్యార్థులతో సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, సెబ్ అడిషనల్ ఎస్పీ ఏటీవీ రవికుమార్, డీఈఓ జి.నాగమణి, కళాశాల ప్రిన్సిపాల్ ఐఆర్‌కే రాజు, ఎం వేణు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ పోస్టర్ల ఆవిష్కరణ

పోషకాహార లోపం, రక్తహీనత, అలసట నివారణకు పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్నట్టు కలెక్టర్ నాగరాణి తెలిపారు. కలెక్టరేట్‌లో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈనెల 24న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఆల్బెండజోల్-400 మాత్రలను ఈనెల 17,18,19 తేదీల్లో పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలో సుమారు 3.52 లక్షల మాత్రలు అందుబాటులో ఉన్నాయన్నారు. డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు, డీసీహెచ్‌ఎస్ సూర్యనారాయణ, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ భావన తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌కు రాయితీలు

పర్యావరణహితంతో పాటు డబ్బు ఆదా అయ్యే సోలార్ విద్యుత్ రూఫ్‌టాప్‌ను ప్రతి ఇంటిపై అమర్చుకోవాలని కలెక్టర్ నాగరాణి పిలుపునిచ్చారు. విద్యుత్ అధికారులు, సోలార్ వెండర్స్‌తో సమావేశమై ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం అమలుపై సమీక్షించారు. పథకం ప్రత్యేకతలు, రాయితీలను వివరించారు. సూర్యఘర్ పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్, డీఈఈ రాజగోపాల్ చౌదరి పాల్గొన్నారు.

నిండుగా డెక్క.. నీరు పారేదెలా?

- అధ్వానంగా డ్రెయిన్లు
- అవస్థలు పడుతున్న రైతులు
- పొలాల్లో పడని నాట్లు
- పట్టించుకోని అధికారులు



భీమవరంలో తాడేరు వంతెన వద్ద గునుపూడి సౌత్ డ్రెయిన్‌లో గుర్రపుడెక్క



చినగరువు వద్ద కిక్కిసతో నిండి అధ్వానంగా..

భీమవరం: రైతులకు అండగా ఉంటాం.. నిధులు మంజూరు చేశాం.. డ్రెయిన్లలో గుర్రపుడెక్కను తొలగిస్తాం.. అంటూ కూటమి నేతలు గొప్పగా ప్రచారం చేశారు. తీరా చూస్తే మురుగు కాలువల్లో గుర్రపుడెక్క, తూడు, కిక్కిస ఎక్కడికక్కడే ఉండటంతో నీరు పారక నాట్లు వేయలేకపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. సార్వా సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడచిపోతున్నా మురుగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో సుమారు 2.20 లక్షల ఎకరాల్లో సార్వా వరి నాట్లు వేయాలి. అయితే చాలా ప్రాంతాల్లో మురుగునీటి సమస్యతో చేలల్లోని బయటకు వెళ్లక నాట్లు వేయలేని పరిస్థితి కనిపిస్తోంది.

మరమ్మతులకు రూ.9 కోట్లు

రైతులు, రైతు సంఘాల ఆందోళనలతో జిల్లాలోని ప్రధాన డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూడు, కిక్కిస తొలగింపు, డ్రెయినేజీ పనులకు ప్రభుత్వం సుమారు రూ.9 కోట్లు మంజూరు చేసింది. రూ.5.92 కోట్లతో తూడు, గుర్రపుడెక్క తొలగింపునకు 35 పనులు, రూ.3.02 కోట్లతో 64 పూడికతీత పనులు చేపట్టాలని నిర్ణయించారు. మంత్రి నిమ్మల రామానాయుడు అట్టహాసంగా డ్రోన్ల సాయంతో డ్రెయిన్లలో మందు పిచికారీ కూడా ప్రారంభించారు. అయితే డ్రెయిన్లలో మందు పిచికారీతో గుర్రపుడెక్క, తూడు ఎండిపోయాయి తప్ప వాటిని తొలగించకపోవడంతో నీరు ముందుకు పారడం లేదు.

మరింత అధ్వానంగా గునుపూడి సౌత్ డ్రెయిన్

పాలకోడేరు మండలంలో ప్రారంభమయ్యే గునుపూడి సౌత్ డ్రెయిన్ భీమవరం, మొగల్తూరు మండలాల మీదుగా ప్రవహించి ఉప్పుటేరులో కలుస్తుంది. సుమారు 15 వేల ఎకరాల్లోని మురుగు నీటి పారుదలకు ఉపయోగపడే ఈ డ్రెయిన్‌ను ప్రక్షాళన చేయలేదు. ఈ కారణంగా పాలకోడేరు మండలంలోని విస్సాకోడేరు, వంకాయలపాలెం, భీమవరం మండలంలోని గునుపూడి, తాడేరు, తుందుర్రు, దిరుసుమర్రు, యనమదుర్రు, రామాయణపురం, దెయ్యాలతిప్ప, పెదగరువు, చినగరువు, బేతపూడి తదితర గ్రామాల్లో సార్వా పంటకు విరామం ప్రకటించినట్లేనని రైతులు చెబుతున్నారు. డ్రెయిన్ల ప్రక్షాళనపై కలెక్టర్ నాగరాణి ప్రత్యేక దృష్టి సారించినా జలవనరులశాఖ అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. డ్రెయిన్లలో రసాయనాలు పిచికారీ చేసి వదిలేయకుండా యంత్రాలతో పూర్తిగా తొలగిస్తేనే మేలు జరుగుతుందని అంటున్నారు.

గోదావరి బండ్ రోడ్డు శుభ్రం



సాక్షి స్పందన

నరసాపురం: నరసాపురంలో లాకుల వద్ద నుంచి ఉన్న గోదావరి బండ్ రోడ్డును మున్సిపల్ అధికారులు శుభ్రం చేయించారు. 'పట్టణాభివృద్ధిపై దృష్టి సారించాలి' శీర్షికన ఈనెల 8న 'సాక్షి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గోదావరి బండ్ రోడ్డు మార్జిన్లలో పిచ్చిమొక్కలు, మట్టి దిబ్బలు, చెత్తను తొలగించి శుభ్రం చేయడంతో పాటు ఇక్కడ చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటుచేశారు.

క్లుప్తంగా

కోళ్లవ్యర్థాల లారీలు సీజ్

గణపవరం(భీమడోలు): నిషేధిత కోళ్ల వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను భీమడోలు పోలీసులు సీజ్ చేశారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి కోళ్ల వ్యర్థాలను కొల్లేరులోని చెరువుల్లో మేతగా వేయడానికి అక్రమంగా తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు లారీలను పట్టుకుని డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు.

మామకు కోడలు తలకొరివి


మామ చితికి నిప్పు పెడుతున్న కోడలు భవానీ

ఏలూరు టౌన్: కొడుకు చనిపోయాక తమ ఆలనాపాలనా చూస్తూ.. సేవలు చేసిన కోడలే చనిపోతే తలకొరివి పెట్టాలన్న మామ కోరికను కోడలు నిజం చేసింది.. ఏలూరులో జరిగిన ఈ సంఘటన సమాజంలోని కుటుంబ విలువలకు అద్దం పట్టింది. ఏలూరు తూర్పువీధికి చెందిన యర్రంశెట్టి నరసింహారావు అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి పదవీవిరమణ చేశారు. భార్య యర్రంశెట్టి నాగమణి (70)తో కలిసి జీవిస్తున్నారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు గౌరీశంకర్ కుమార్‌కు భవానీతో వివాహమైంది. 8 ఏళ్ళ క్రితం గౌరీశంకర్ అనారోగ్యంతో మృతిచెందాడు. కోడలు భవానీ మామ, అత్తలతో ఉంటోంది. అత్తామామలను సొంత కూతురిలా చూసుకునేది.

ఉండి గోరింతోటలో యువకుడి హత్య


నల్లగంగుల నిఖిల్, మృతుడు(ఫైల్)

ఉండి: స్నేహితులతో వెళ్లిన కుమారుడు తిరిగి శవంగా రావడంతో ఆ కుటుంబ సభ్యుల శోకం వర్ణణాతీతం. పోలీసుల వివరాల ప్రకారం భీమవరం గునుపూడి ప్రాంతానికి చెందిన నల్లంగుల నిఖిల్(25) ముంబయికి చెందిన సీఫుడ్ ట్రేడింగ్ కంపెనీలో ఇన్స్‌పెక్షన్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. 12వ తేదీ ఉదయం 5 గంటలకు విజయవాడ నుంచి కన్యాకుమారి వెళ్లేందుకు టికెట్ బుక్ చేసుకున్నాడు. ప్రయాణానికి అసరమైన సామాన్ల కోసం ఆదివారం రాత్రి అన్న బైక్ తీసుకుని ఆకివీడు వెళ్ళాడు. ఆ సమయంలో నిఖిల్ చిన్ననాటి స్నేహితుడు పాలకొల్లు శంభునిపేటకు చెందిన మొల్లల పవన్‌కుమార్ ఉండడాన్ని మృతుడి తండ్రి ఎలీషారావు గమనించాడు. గతంలో నిఖిల్, పవన్‌కుమార్‌కు ఆర్థిక వివాదాలు ఉండడంతో చంపుతానని పలుమార్లు నిఖిల్‌ను అతడు హెచ్చరించాడని.. కొన్నిసార్లు పవన్‌కుమార్, భీమవరం దుర్గాపురానికి చెందిన మారేష్‌లు నిఖిల్‌తో గొడవపడ్డారని ఆయన ఆరోపిస్తున్నాడు. ఆదివారం రాత్రి నిఖిల్‌తో పవన్‌కుమార్, మారేష్, మరో ముగ్గురు తన కుమారుడిని హత్య చేసేందుకు ఉండి గోరింతోటకు తీసుకువెళ్లారని దీనిని రైలు ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారంటూ ఎలీషా ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టీటీడీ భూముల రహస్య వేలం

పెంటపాడు: పెంటపాడు మండలం పరిమెళ్లలో సుమారు 13 ఎకరాల టీటీడీ భూముల వేలంపాటను అధికారులు సోమవారం రహస్యంగా నిర్వహించారు. 13 ఎకరాలకు సుమారు 1.85 లక్షల ఆదాయం సమకూరినట్లు తెలిసింది. మూడేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ వేలంపాటపై పత్రికా ప్రకటన గానీ, గ్రామంలో టముకు గానీ వేయించలేదని గ్రామస్తులు చెబుతున్నారు.

నిర్వహణ గాలికొదిలేశారు

- ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోనే మందు పార్టీలు
- సిబ్బంది మధ్య గ్రూపులు
- టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోనే మారిన పరిస్థితి


నూజివీడు ట్రిపుల్ ఐటీలోని అకడమిక్ భవనం

నూజివీడు: గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ప్రపంచ స్థాయి సాంకేతిక విద్యను అందించాలన్న సమున్నత లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఐటీల్లో నూజివీడు ట్రిపుల్ ఐటీ ఒకటి. వీటిలో చదివిన విద్యార్థులు అత్యున్నత ఉద్యోగాలు సాధిస్తూ తమ భవితకు బాట వేసుకుంటున్నారు. అలాంటి నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రస్తుత ప్రభుత్వ హయాంలో నిర్వహణను గాలికొదిలేయడంతో విద్యార్థులు గాడితప్పుతున్నారు. క్యాంపస్‌లోనే మందు పార్టీలు చేసుకుంటున్నారు. సిబ్బంది మధ్య గ్రూపులు, బయట వ్యక్తులు లోపలికి ప్రవేశిస్తుండటం... వెరసి గ్రామీణ పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన విద్యాసంస్థ ప్రతిష్ట మసకబారే పరిస్థితి ఏర్పడింది. టీడీపీ ప్రభుత్వం ఈ సంస్థపై దృష్టి పెట్టకపోవడంతో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా తయారైంది. సెక్యూరిటీ విభాగం లోపభూయిష్టంగా తయారవడంతో ట్రిపుల్ ఐటీ క్యాంపస్ అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారుతోంది. విద్యార్థులు మద్యం సేవించి మత్తులో తూగుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

కొత్త డైరెక్టర్‌ను ఎప్పుడు నియమిస్తారు?

ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌గా ఉన్న ఆచార్య ఎం.చంద్రశేఖర్‌ను రాజీనామా చేయాలని ఫోన్ చేసి మరీ ఒత్తిడి చేయడంతో గత నెలలోనే తన పదవికి రాజీనామా చేశారు. నెల రోజులు గడిచినా ఇంతవరకు కొత్త డైరెక్టర్‌ను నియమించలేదు. కొత్త డైరెక్టర్‌ను నియమించని నేపథ్యంలో ఉన్న డైరెక్టర్‌ను ఎందుకు రాజీనామా చేయమన్నారనే ప్రశ్నలు ట్రిపుల్ ఐటీ సిబ్బందిలోనే వినిపిస్తున్నాయి. అకడమిక్ ప్రారంభంలో అనేక కీలక బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. అలాంటి సమయంలో ఉన్న డైరెక్టర్‌ను అవగాహన రాహిత్యంతో రాజీనామా చేయమనడంపై ట్రిపుల్ ఐటీ వర్గాల్లో విస్మయం వ్యక్తమైంది.

పుట్టినరోజు పేరుతో మద్యం పార్టీలు

ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరం విద్యార్థులు గత నెలలో పుట్టినరోజు పేరుతో క్యాంపస్ హాస్టల్‌లోకి మద్యం సీసాలు తీసుకొచ్చి మందు పార్టీ చేసుకోవడం సంచలనంగా మారింది. ట్రిపుల్ ఐటీ స్థాపించిన 15 ఏళ్లలో ఏనాడూ మద్యం ట్రిపుల్ ఐటీ ఆవరణలోకి రాలేదని సిబ్బంది, విద్యార్థులు గుర్తుచేస్తున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాతే మద్యం హాస్టల్ భవనంలోకి వెళ్లిందంటున్నారు. సెక్యూరిటీ వైఫల్యం వల్లే ఈ సంఘటనకు ఆస్కారం ఏర్పడిందని తెలుస్తోంది. సెక్యూరిటీ సిబ్బందిని, విద్యార్థులను సస్పెండ్ చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు.

రెండు రోజులు లోపలే మకాం

జూలై చివరి వారంలో నూజివీడు ట్రిపుల్ ఐటీలో రెమీడియల్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు రాయడానికి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ నుంచి సైతం విద్యార్థులు వచ్చారు. ఒక విద్యార్థిని స్నేహితుడు నూజివీడు క్యాంపస్ లోపలికి వచ్చి రెండు రోజులపాటు లోపలే ఉన్నాడు. అయినప్పటికీ సెక్యూరిటీ సిబ్బంది, హాస్టల్ కేర్ టేకర్స్, హాస్టల్ సెక్యూరిటీ సిబ్బంది ఎవరూ గుర్తించలేదు.

ఇష్టారాజ్యంగా రోడ్లపై సంచారం

ట్రిపుల్ ఐటీలో తరగతులు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తారు. మధ్యలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు లంచ్ విరామం. ఈ సమయంలో తప్ప తరగతులు జరుగుతున్న సమయంలో నాన్ టీచింగ్ స్టాఫ్ గానీ, టీచింగ్ స్టాఫ్ గానీ క్యాంపస్ దాటి బయటకు వెళ్లకూడదు. కానీ ఇక్కడ ఎవరిష్టం వారిది. పనివేళల్లోనే బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది తమ ఇష్టారాజ్యంగా రోడ్లపై కనిపిస్తుండటం గమనార్హం. డ్యూటీ సమయంలో బయటకు వచ్చి టీ స్టాల్స్ వద్ద గంటల తరబడి కబుర్లు చెప్పుకొని వెళ్లడం పరిపాటిగా మారింది.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి


ప్రమాద స్థలంలో గాయపడిన ఎస్‌కే బాజీ

తాడేపల్లిగూడెం అర్బన్ : ఆర్టీసీ బస్సు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. తాడేపల్లిగూడెం 16వ వార్డుకు చెందిన ఎస్‌కే బాజీ(45) తాపీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. సోమవారం సాయంత్రం పని ముగించుకుని జువ్వలపాలెంలోని ఇంటికి వెళుతుండగా రావులపాలెం నుంచి తాడేపల్లిగూడెం వస్తున్న తణుకు డిపో ఆర్టీసీ బస్సు వ్యతిరేక దిశలో రావడంతో ఎస్‌కే బాజీని బలంగా ఢీకొంది. దీంతో రోడ్డుపక్కన ఉన్న డివైడర్‌కు బాజీ తల బలంగా తగలడంతో తీవ్ర గాయమైంది. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సులో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఎస్‌కే బాజీని తరలించారు. వైద్యులు పరిశీలించి బాజి మృతి చెందినట్లు నిర్ధారించారు.

భారీ గుంతలతో ప్రమాదాలు

బైపాస్‌రోడ్డు నుంచి జువ్వలపాలెంలోని విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం వరకు రహదారి భారీ గోతులతో నిండడంతో భారీ వాహనాలు బస్సులు, లారీలు వ్యతిరేక దిశలో ప్రయాణం చేస్తున్నాయి. కొన్నిసార్లు వాహనాలు ఎదురుగా రావడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

విత్తనశుద్ధితో చీడపీడల నుంచి రక్షణ


విత్తన శుద్ధిపై రైతులకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయ అధికారి

జంగారెడ్డిగూడెం: పంటల సస్యరక్షణలో మేలైన ప్రక్రియ విత్తనశుద్ధి. కీలక ప్రక్రియగా పేర్కొనే ఈ విత్తనశుద్ధితో తొలిదశలో ఆశించే పురుగులు, తెగుళ్ల బారి నుంచి పంటలను కాపాడుకోవచ్చు. భూమిని దున్నడం ఎంత ముఖ్యమో శుద్ధి చేసిన విత్తనాన్ని వాడటం అంతే ప్రధానం. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించడానికి విత్తన శుద్ధి కీలక ప్రక్రియ. దీని వల్ల చీడపీడల ఉధృతి తగ్గించి, పంట దశలో ఆశించే రసం పీల్చే పురుగులు, వైరస్‌ల నుంచి పంటల్ని కాపాడుకోవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

కోత కోసేటప్పుడు, నూర్పిడి జరిగేటప్పుడు కొన్ని శిలీంధ్ర భాగాలు విత్తనాలతో కలిసి పంటను ఆశిస్తాయి. విత్తనాలలో తెగుళ్లను కలుగజేసే సూక్ష్మక్రిములు బీజాల రూపంలో ఉండి తిరిగి విత్తనాలను నాటినప్పుడు చీడపీడల రూపంలో బయటపడతాయి. సాధారణంగా రైతు సోదరులు పైరుకు తెగుళ్ల ఆశించినప్పుడు మాత్రమే శిలీంధ్ర రసాయనాలను పిచికారి చేస్తారు. తెగుళ్ల ప్రారంభ దశలోనే గమనించకపోవడం, సకాలంలో సస్యరక్షణ చేపట్టకపోవడం వల్ల తెగుళ్ల నివారణ రైతులకు కష్టసాధ్యమవుతుంది. విత్తనం మంచిదైతేనే పంట బాగుంటుంది. కాబట్టి కనిపించని శిలీంధ్రాల బారి నుంచి పలు విత్తనాలను రక్షించుకోవాలంటే విత్తనశుద్ధి ఆవశ్యకత ఎంతో ఉంది.

విత్తన శుద్ధి అంటే

విత్తనాల ద్వారా ఆశించే పురుగులు, తెగుళ్లను నివారించడం.. మొలకదశలో నేలలో కీటకాలు, శిలీంధ్రాల నుంచి విత్తనాలను కాపాడడానికి విత్తనాలను సరైన పద్ధతిలో శుద్ధి చేయడాన్ని విత్తన శుద్ధి అంటారు.

విత్తనశుద్ధి వలన ప్రయోజనాలు

- విత్తనాన్ని శుద్ధితో విత్తనాలను ఎక్కువ కాలం నిల్వ చేసుకోవచ్చు.
- భూమిలో, విత్తనాలలో వుండే సూక్ష్మ క్రిముల నుంచి మొలకెత్తే విత్తనాలను, చిరుమొక్కలను కాపాడుతుంది.
- ఎక్కువ విత్తనాలు మొలకెత్తుతాయి.
- త్వరగా ఒకే రీతిలో మొలకలు వచ్చి ఎదుగుతాయి
- పప్పు జాతి పంటలలో ఎక్కువ కణుపులు రావడానికి తోడ్పడుతుంది
- భూమిలో కాని, మొక్కలకు కాని మందుచల్లడం కంటే మెరుగైనది
- ప్రతికూల పరిస్థితులలో కూడా (గాలిలో తేమశాతం తక్కువగా / ఎక్కువగా ఉన్నప్పుడు కూడా) పంట ఒకే తీరులో ఉంటుంది.
- నేల ద్వారా వ్యాపించే తెగుళ్లు, పురుగులను సమర్థంగా నివారించడానికి దోహదపడుతుంది.
- మందులు విత్తనంలోకి చొచ్చుకు పోయి శిలీంధ్రాలను నాశనం చేస్తాయి.

అనుసరించవలసిన విధానం:

- కిలో విత్తనానికి 3 గ్రాము కార్బండిజమ్ లేదా 2.5 గ్రాముల మాంకోజబ్ కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి.
- మోతాదుకు మించితే విత్తన మొలక శాతం దెబ్బతింటుంది.
- జీవరసాయనాలతో మరోసారి శుద్ధి చేయాలి.
- గింజ పగులకుండా, పైపొర పోకుండా జాగ్రత్త తీసుకోవాలి.
- శుద్ధి చేసేటప్పుడు చేతులకు గ్లౌజులు, ముఖానికి గుడ్డకట్టుకోవాలి

విత్తనశుద్ధితో మంచి దిగుబడి



విత్తనశుదక్థితో మంచి దిగుబడి సాధించవచ్చు. దీనివల్ల చీడపీడలను ఎదుర్కొనే సామర్థ్యం మొక్కలకు ఏర్పడుతుంది. ఎరువులు, పురుగుమందుల ఖర్చు తగ్గుతుంది. నాణ్యమైన దిగుబడి సాధించడం వల్ల మార్కెట్‌లో ఉత్పత్తులకు మంచి ధర లభిస్తుంది. రైతులు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే వ్యవసాయం లాభసాటిగా మారుతుంది.

– పీజీ బుజ్జిబాబు, ఏడీఏ, వ్యవసాయ శాఖ

పశువుల్లో గురక వ్యాధి నివారణ ఇలా..



పాడి - పంట

చింతలపూడి: వర్షాకాలంలో పశువులు రకరకాల అంటు రోగాల బారినపడే ప్రమాదం ఉంది. కొత్త నీరు మురుగు నీటితో కలిసి కలుషితమవడం వల్ల పశువులు ఆ నీటిని తాగి అంటు రోగాల బారిన పడతాయి. వర్షాకాలంలో గేదెలు, గేదె దూడలకు ఎక్కువగా వచ్చేది గురక వ్యాధి. దీనినే గొంతు వాపు వ్యాధి అని పిలుస్తారు. పశువుల్లో వచ్చే వ్యాధుల్లో ఇది అత్యంత ప్రమాదకరమైనది. గురక వ్యాధి సోకిన పశువులకు అందించాల్సిన చికిత్సను గురించి పశుసంవర్ధక శాఖ ఏడీ డా.జె. లింగయ్య సూచనలు తెలుసుకుందాం.

ఎలా సంక్రమిస్తుంది

పాశ్చురెల్లా మల్టోసిడా అనే బ్యాక్టీరియా వల్ల పశువులు, గొర్రెలు, మేకలలో ఈ వ్యాధి వస్తుంది. క్రిములు ఎడతెరపి లేని ముసురు వాతావరణంలో వేగంగా వృద్ధి చెందుతాయి. కలుషితమైన నీరు, మేత, ,పరికరాలు, విసర్జకాలు, స్రావాలు, కళేబరాలు, మాంసం ద్వారా వేగంగా వ్యాప్తి చెందుతాయి. ఇందుకు ఈగలు, దోమలు, ఇతర కీటకాలు కూడ దోహద పడతాయి. క్రిములు ఎర్ర రక్త కణాలను దెబ్బతీసి ప్రాణవాయువు ప్రక్రియను దెబ్బ తీస్తుంది. దీంతో ప్రాణ వాయువు సరిగా అందక పశువులు గురక పెట్టడం, రొప్పడం, ఆయాస పడటం చేస్తాయి. పశువుల ఉష్ణోగ్రత 106 నుంచి 108 డిగ్రీలకు పెరుగుతుంది. కనుపాపలు ఎర్రగా మారిపోవడం, మేత నెమరు నిలిచి పోవడం, మెడ, గొంతు వాయడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి క్రిములు శరీరంలోకి ప్రవేశించిన 12 నుంచి 36 గంటలకు వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. సకాలంలో వైద్యం అందకపోతే మరో 12 నుంచి 24 గంటలలో పశువు మరణిస్తుంది.

గురక వ్యాధి చికిత్స

వ్యాధిని గుర్తించిన మరుక్షణం రక్త పరీక్షలు నిర్వహించాలి. వ్యాధి సోకిన పశువును ఇతర పశువుల నుంచి వేరు చేయాలి. పశువులను నిలబెట్టి మాత్రమే వైద్యం చేయాలి. యాంపిసిల్లిన్, క్లోక్సాసిలిన్, జెంటా మైసిన్, సెఫలాక్సిన్ వంటి యాంటి బయోటిక్ మందుల్ని సరైన మోతాదులో అవసరాన్ని బట్టి రక్తంలోకి ఎక్కిస్తే వేగంగా ఉపశమనం కలుగుతుంది. సాంబ్రాణి ధూపం వేయడం కూడ మంచిదే. వ్యాధి నిరోధక శక్తిని పెంచే మోమెజోల్ ఇంజెక్షన్‌లు, బీ కాంప్లెక్స్ ఇంజెక్షన్‌లు ఇవ్వాలి. బాగా నీరసించిన పశువుకైతే డెక్స్ట్రోజ్ సెలైన్లు అవసరం ఉంటుంది.

నివారణ

పరిసరాలలో క్రిమి కీటకాలు వృద్ధి చెందకుండా పొడిగా ఉంచాలి. డీడీటి, గమాక్సిన్, సైపర్‌మెత్రిన్, కార్బొరిల్ వంటి క్రిమి సంహారకాలతో శుభ్రం చేయాలి. పొరుగు ప్రాంతాల నుంచి వచ్చిన పశువులను కనీసం వారం రోజులన్నా వేరుగా ఉంచి, వ్యాధి లేదని నిర్ధారించుకున్నాక మిగిలిన పశువులతో కలవనివ్వాలి. ప్రభుత్వం ఏటా ఉచితంగా టీకాలు ఇస్తుంది. ప్రస్తుతం గురక వ్యాధి, జబ్బవాపు, గాలికుంటు వ్యాధుల నిర్మూలనకు ఒకే వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. పశువైద్యుల సూచనల మేరకు ఈ టీకాలను తొలకరి తొలి దశలో లేదా ఎండలు ముదిరాక వేయిస్తే మంచిది.

సిమెంట్ ఏజెన్సీ ఇప్పిస్తానని మోసం

దెందులూరు: సిమెంట్ కంపెనీ ఏజెన్సీ ఇప్పిస్తానని రెండు విడతలుగా రూ.1.72 లక్షల నగదు తీసుకుని వుండేళ్ళ కిరణ్‌కుమార్ రెడ్డి (కడప) మోసం చేశాడని మద్దా భూషణం ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రామారావుగూడెంలో సిమెంట్ కంపెనీ ఏజెన్సీ ఇప్పిస్తానని, మధ్యవర్తి ద్వారా పరిచయమైన కిరణ్‌కుమార్‌రెడ్డి తన వద్ద రెండు విడతలుగా నగదు తీసుకున్నాడన్నారు. డబ్బులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

కుల నిర్మూలనతోనే దేశాభివృద్ధి



భీమవరంలో కెవీపీఎస్ రాష్ట్ర శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

భీమవరం: కుల నిర్మూలన జరిగితేనే దేశాభివృద్ధి సాధ్యమతుందని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం భీమవరం అంబేడ్కర్ భవనంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు అధ్యక్షతన నిర్వహించిన కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవీపీఎస్) రాష్ట్ర శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలకులు కులాన్ని ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణ అంశంపై అనుకూల, ప్రతికూల వాదనలు చేసే నాయకులు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. కులాంతర వివాహాలు ప్రోత్సహించాలని, చేసుకున్న వారికి ప్రభుత్వమే రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై అత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో రాజ్యాంగాన్ని సమూలంగా మార్చాలని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని దానిని కాపాడుకునేందుకు ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.బలరామ్ మాట్లాడుతూ నేటికీ దళితులు అభివృద్ధికి, విద్య, వైద్య సదుపాయాలకు దూరంగా ఉన్నారన్నారు. ప్రభుత్వ భూములను దళితులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు మంతెన సీతారాం, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గాతల జేమ్స్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎ.వీరయ్య, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ ఆనంద్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడులో ఏలూరు కాలువలో స్నానానికి దిగి ఒక వ్యక్తి మృతి చెందాడు. పెంటపాడు ఎస్సై ఎస్.శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడుకు చెందిన ముప్పిడి శంకర ప్రసాద్(36) వెల్డింగ్ పని చేస్తుంటాడు. ఆదివారం పని ముగించుకొని ఇంటి ఎదురుగా ఉన్న ఏలూరు కాలువలో స్నానానికి దిగాడు. ప్రమాదవశాత్తూ జారి గల్లంతయ్యాడు. సోమవారం ఉదయం కొద్దిదూరంలోనే శంకరప్రసాద్ మృతదేహం లభ్యమైంది.భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భీమడోలులో..

గణపవరం(భీమడోలు): భీమడోలు గ్రామానికి చెందిన పిలి సుబ్రహ్మణ్యం(45) ప్రమాదవశాత్తూ కాలు జారి కాల్వలో పడి మరణించాడు. కాళ్లు కడుక్కోవడానికి దిగిన సుబ్రహ్మణ్యం నీట మునిగి మృతి చెందాడు. భీమడోలు ఫైర్ సిబ్బంది మృతదేహాన్ని బయటకు తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుల ప్రవర్తనపై విద్యార్థినుల నిరసన

ఇరగవరం: కొందరు ఉపాధ్యాయులు తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారంటూ విద్యార్థులు, విద్యార్థి సంఘ నేతలు, ఇరగవరం మండలం రేలంగి తుమ్మలపల్లి మాణిక్యం జెడ్పీ హైస్కూల్ ముందు నిరసన తెలిపారు. స్థానికులు, విద్యార్థులు, విద్యార్థి సంఘ నేతలు తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలలో పని చేస్తున్న కె.మురళీ కృష్ణ, జి.వెంకటేశ్వరరావు, వై.అప్పారావు తెలుగు, ఇంగ్లీషు, లెక్కల సబ్జెక్టులు బోధిస్తున్నారు. ఇటీవల విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం ఉదయం పాఠశాల వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. తణుకు డీవైఈవో మురళీ సత్యనారాయణకు సమాచారం తెలియడంతో ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. వివరాలు సేకరించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పాముకాటుతో వృద్ధుడు మృతి

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెంలో సోమవారం పాముకాటుకు గురై ఒక వృద్ధుడు మృతి చెందాడు. పంగిడిగూడెంకు చెందిన మట్టా కనకరాజు(63) ఆవులను పొలంలో మేపుతున్నాడు. ఉదయం 11 గంటల సమయంలో పాము కరిచింది. దాంతో నురగలు కక్కుతూ కింద పడిపోయాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు కనకరాజు కుమారుడు వేణుగోపాలరావుకు సమాచారం అందించారు. అతడు ఘటనా స్థలానికి చేరుకునే సరికే తండ్రి మృతి చెందాడు. వేణుగోపాలరావు ఫిర్యాదు మేరకు ఎస్సై జి.సతీష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృత దేహాన్ని ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జవహర్ నవోదయలో క్రికెట్ ఎంపికలు

పెదవేగి: పెదవేగి పీఎంసీ జవహర్ నవోదయ విద్యాలయంలో మూడు రోజులు పాటు జరిగే రీజనల్ క్రికెట్ సెలక్షన్స్ నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజనల్ అసిస్టెంట్ కమిషనర్ ఉమాపతిరెడ్డి ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ బీ.సీతాలక్ష్మి అధ్యక్షతన ఈ నెల 13, 14, 15 తేదీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, పాండిచ్చేరి రాష్ట్రాల్లోని జవహర్ నవోదయ విద్యార్థులు 198 మంది సెలక్షన్స్‌లో పాల్గొన్నారు. తొలుత ఉమాపతిరెడ్డి, ప్రిన్సిపాల్ సీతాలక్ష్మికి, అధ్యాపకులు, విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ ద్వారా ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం క్రీడా పతాకాన్ని ఉమాపతిరెడ్డి ఆవిష్కరించారు. మరోవైపు సోమవారం అండర్–14 బాలుర విభాగం, అండర్–17 బాలికల విభాగాలకు ఎంపికలు జరిగాయి.

బాణసంచా దుకాణంలో అగ్నిప్రమాదం


ఆలమూరులో దుకాణం నుంచి మంటలు

పెనుమంట్ర: పెనుమంట్ర మండలం ఆలమూరులో శ్రీలక్ష్మి బాణసంచా దుకాణంలో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. రూ.2 లక్షలు ఆస్తి నష్టం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో బాణసంచా దుకాణం నుంచి పొగలు రావడంతో గమనించిన స్థానికులు అగ్ని మాపక కేంద్రాలకు సమాచారం అందించారు. అత్తిలి, పాలకొల్లు అగ్ని మాపక కేంద్రాల నుంచి సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మంటలను అదుపు చేశారు. షాపు యజమాని పడాల శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు పెనుమంట్ర పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జ్ ఎస్సై కె.గంగాధర్‌రావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తణుకు: హైవే నిర్వహణ పట్ల అధికారుల నిర్లక్ష్యం ఒక యువకుడి మృతికి కారణమైంది. తణుకు పట్టణంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ అదుపు తప్పిన ఉండ్రాజవరం మండలం పాలంగికి చెందిన గంగులకుర్తి పూర్ణచంద్ర సాయికుమార్ (22) మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయికుమార్ తణుకులోని ఒక బైక్ షోరూంలో సేల్స్‌మేన్‌గా పని చేస్తున్నాడు. సోమవారం తణుకు నుంచి స్వగ్రామం బైక్‌పై బయల్దేరాడు. ఉండ్రాజవరం జంక్షన్ వద్ద ఫ్లైవోవర్ నిర్మాణంలో భాగంగా ట్రాఫిక్ మళ్లించే క్రమంలో గణేష్ చౌక్ వద్ద రోడ్డుకు అడ్డంగా తాడు కట్టారు. తాడును గమనించని సాయికుమార్ వేగంగా రావడంతో అదుపు తప్పి కింద పడిపోయాడు. ప్రమాదంలో సాయికుమార్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. హైవే అధికారుల నిర్లక్ష్యం కారణంగా యువకుడు మృతి చెందాడని ఆరోపిస్తూ గ్రామస్తులు అక్కడే ఉన్న అధికారులను నిలదీశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని హైవే అధికారులను పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

క్లుప్తంగా

అర్హులకు ఇళ్ల స్థలాలు అందజేయాలి



ఆర్డీఓ బీఎస్ నారాయణరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రొక్కాల నాగబుజ్జి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పడాలలో అర్హులైన ప్రజలందరికి ప్రభుత్వ ఇళ్ల స్థలాల ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ డివిజన్ కమిటీ సభ్యులు రొక్కాల నాగబుజ్జి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో సోమవారం తాడేపల్లి గూడెం ఆర్డీఓ బీఎస్ నారాయణరెడ్డి దృష్టికి స్థలాలు విషయమై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగబుజ్జి మాట్లాడుతూ ఇటీవల పౌరహక్కుల దినోత్సవం మీటింగ్ జరిగిందని, పడాల వాసులు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని ఆ సమావేశంలో కోరారని చెప్పారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళ తానని ఆర్డీఓ వివరించారు.

దువ్వలో విద్యార్థుల తిరంగా యాత్ర



దువ్వ గ్రామంలో హర్ ఘర్ తిరంగా యాత్ర చేస్తున్న విద్యార్థులు, నాయకులు

తణుకు టౌన్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలోని పాఠశాలల విద్యార్థులతో బీజేపీ నాయకులు హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు. సోమవారం దువ్వ గ్రామంలోని సరస్వతి పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు సుమారు 100 అడుగుల జాతీయ జెండాను చేతబట్టి గ్రామంలోని ప్రధాన రోడ్లలో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కె వెంకటరెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు దాసరి వెంకటస్వామి, కూటమి నాయకులు అరిగెల బాబి, పీ వెంకట ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడు

తాడేపల్లిగూడెం అర్బన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గుర్తు తెలియని వృద్ధుడు (70) చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే ఈ నెల 10వతేదీన సాయంత్రం సమయంలో తాడేపల్లిగూడెంలో ఆర్టీసీ డిపో వద్ద నుంచి సుమారు 70 ఏళ్ల వయసున్న ఒక వృద్ధుడు సైకిల్ తొక్కుకుంటూ వస్తుండగా అదుపు తప్పి పడిపోయాడు. దీంతో అతను తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆ వృద్ధుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. వృద్ధుడి వివరాలు తెలియకపోవడంతో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ పి.సూర్యనారాయణ మాట్లాడుతూ ఈ వృద్ధుడివివరాలు తెలిసినవారు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని తెలిపారు.

దేశం కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలి



సమావేశంలో మాట్లాడుతున్న పరమవీర చక్ర అవార్డు గ్రహీత సంజయ్‌కుమార్

తాడేపల్లిగూడెం: దేశం కోసం ఎవరి రంగంలో వారు చిత్తశుద్ధితో పని చేయాలని పరమవీర చక్ర అవార్డు గ్రహీత సుబేదార్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమంలో భాగంగా సుబేదార్ విజయ్‌కుమార్ విద్యార్థులతో మాట్లాడారు. ఎందరో సైనికుల ప్రాణం కార్గిల్ విజయమన్నారు. యువత దేశం కోసం ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు, రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘ ప్రతినిధి తనుబుద్ధి భోగేశ్వరరావు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆకివీడు: గ్రంథాలయాలు విజ్ఞాన గని లాంటివని అధ్యాపకులు ఆనంద కుమార్ అన్నారు. దుంపగడపలోని వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ప్రిన్సిపాల్ కే.సుజాత అధ్యక్షత వహించారు. అధ్యాపకులు కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాల్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుస్తకాల్ని చదవడం ద్వారా ఎంతో జ్ఞానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఓగేశ్వరరావు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్ర కాలువ మిగిల్చిన విషాదం

- చేలలో వేసిన మేటలు
- పూర్తిగా వీడని ప్రమాదం
- ఎర్ర కాలువ పటిష్టత చర్యలు ఎప్పటికో?



మాధవరం - కంసాలిపాలెం కాజ్ వే వద్ద ప్రవహిస్తున్న ఎర్ర కాలువ (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్: ఆరుగాలం శ్రమిస్తున్న రైతుకు ప్రకృతి ప్రకోపం ఏ ఏడాదికాయేడాది విషాదాన్ని మిగులుస్తుంది. ఎన్నో కష్టనష్టాల కోర్చి వరి పండిస్తున్న రైతుపై ఏదోక రూపంలో ప్రకృతి కన్నెర్ర చేస్తోంది. ఈ క్రమంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే కురిసిన అధిక వర్షాలకు ఎర్ర కాలువ ఉగ్రరూపం దాల్చి తాడేపల్లి గూడెం మండలంలోని పరీవాహక గ్రామాల్లోని వరి నాట్లను ముంచెత్తింది. దీంతో నేటికీ పూర్తి స్థాయిలో వరి చేలు తెప్పరిల్లిన దాఖలాలు లేవు. ప్రధానంగా నందమూరు, మారంపల్లి, ఆరుళ్ల, జగన్నాథపురం, నవాబుపాలెం, మాధవరం, పట్టింపాలెం, వీరంపాలెం తదితర ఎర్ర కాలువ ఆయకట్టులో వరి సాగు చేస్తున్న వారంతా కౌలు రైతులే. అప్పులు చేసి మరీ సాగు చేసే పరిస్థితి. అప్పటికే రెండు దఫాలుగా వేసిన నారు వర్షాలకు దెబ్బతింది. మూడోసారి వేసిన ఎర్ర కాలువ ముంపునకు గురైంది. దీంతో నాట్లు వేసేందుకు పెట్టిన ఖర్చులు ఎర్ర కాలువ పాలైంది. ఈ నేపథ్యంలో రైతాంగం లబోదిబోమంటుంది. ఇదిలా ఉంటే కాలువ ఆయకట్టులోని వరి చేలలో ఇసుక మేటలు వేయడం రైతాంగాన్ని మరింత ఆవేదనకు గురి చేస్తోంది. ఇసుక మేటలు తీసి, వరి సాగు చేపట్టాలంటే మరింత ఖర్చుతో కూడుకున్నది. దీంతో ఈ ఖరీఫ్ సీజన్ పూర్తిగా వదులుకోవలసిన పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు ఎర్ర కాలువ ఉధృతికి మాధవరం - కంసాలిపాలెం, అప్పారావుపేట-కోరుమామిడి వెళ్ల రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఏటా వర్షాల సమయంలో ఎర్ర కాలువ ఉప్పొంగడంతో తాడేపల్లిగూడెం మండలంలోని పరీవాహక రైతాంగం ఈ సమస్యను ఎదుర్కొంటోంది. ఈ సమస్యకు పరిష్కారం ఎప్పటికి లభించేనో? అని రైతాంగం కోటి ఆశలతో ఎదురుచూస్తోంది.



వరి చేలలో తిష్ట వేసిన రాళ్లు, చెత్తా చెదారాలు



ఎర్ర కాలువ ముంపు నుంచి తేరుకుంటున్న వరి చేలు



ఎర్ర కాలువ ఉధృతికి కోతకు గురైన మాధవరం - కంసాలిపాలెం రహదారి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న మహిళా సంరక్షణ అధికారిణి స్వప్నశ్రీ

అత్తిలి: బాల్యవివాహాలు చేయడం వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని మహిళా సంరక్షణ అధికారిణి ఎం స్వప్నశ్రీ అన్నారు. సోమవారం అత్తిలి మండలం బల్లిపాడు ప్రాథమిక పాఠశాలలో బేటీ పడావో-బేటీబచావో కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాలు నిరోధక చట్టంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా స్వప్నశ్రీ మాట్లాడుతూ బాలికల చదువు భావితరాలకు వెలుగు అని అన్నారు. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యానేరమన్నారు. బాల్యవివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. 18 ఏళ్ల నిండకుండా ఆడపిల్లలకు, 21 ఏళ్లు నిండకుండా మగ పిల్లలకు పెళ్లి చేయరాదన్నారు. బాల్య వివాహాలు జరిపే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమం అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం శివసత్యవతి, డి నర్సవేణి, బి నిర్మల, సిహెచ్‌వీ రామలలిత, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్



తణుకు మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

తణుకు టౌన్: ప్రభుత్వ గ్రాంట్లతో పాటు దాతల సహాయాలను సద్వినియోగం చేస్తూ గ్రామాభివృద్ధికి సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు కృషి చేయాలని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ చెప్పారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ పాలనపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ గ్రామాల్లో పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. దేశంలో మొట్టమొదటిగా పంచాయతీరాజ్ వ్యవస్థను అమలు చేసిన రాష్ట్రాల్లో మన రాష్ట్రం రెండవదన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు గ్రామ పంచాయతీలకు, మైనర్ గ్రామ పంచాయతీలకు రూ. 100 నుంచి 10 వేలు, మేజర్ పంచాయతీలకు రూ. 250 నుంచి 25 వేలను పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దీనితో పాటు స్థానిక సంస్థలకు ఎన్నికైన ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు కూడా గౌరవ వేతనాన్ని పెంచాలని కోరారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సర్పంచ్‌లకు గ్రామాల్లో సాధారణ పాలన, పారిశుద్ధ్యం, వీధిలైట్లు, మంచినీటి సరఫరా, వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణ, ఎంపీపీ రుద్ర ధనరాజు, ఎంపీడీవో డీ శ్రీలలిత, ఈవోపీఆర్‌డీ ఏఎస్ కోటేశ్వరరావు, గ్రామ సర్పంచ్‌లు కరిబండి రాజేష్, పాలా శ్రీను, శిక్షణ తరగతుల రీసోర్సు పర్సన్, వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులకు సర్పంచ్‌ల డుమ్మా

మండలంలో సర్పంచ్‌లకు, గ్రామ కార్యదర్శులకు శిక్షణ కోసం ఏర్పాటు చేసిన ఈశిక్షణా కార్యక్రమాలకు ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. మండలంలో మొత్తం 9 మంది గ్రామ సర్పంచ్‌లు ఉండా వారిలో ఇద్దరు మాత్రమే ఈశిక్షణా శిబిరానికి హాజరయ్యారు. మండలంలో మొత్తం నలుగురు మహిళా సర్పంచ్‌లు ఉండగా వారిలో ఇద్దరు సర్పంచ్‌ల తరఫున వారి భర్తలు హాజరయ్యారు. హాజరైన ఇద్దరు సర్పంచ్‌లు, మరో ఇద్దరు మహిళా సర్పంచ్‌ల తరఫున హాజరైన భర్తలు కూడా ముఖ్యఅతిథి ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ వెళ్లిపోవడంతో వీరు కూడా శిక్షణా కార్యక్రమం నుంచి జారుకున్నారు. ఈ శిక్షణా కార్యక్రమం ఒక్క గ్రామ కార్యదర్శుల కోసమే ఏర్పాటు చేసినట్లుగా మారిపోయింది.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న సొసైటీ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మత్తు మందులకు, వ్యసనాలకు దూరంగా ఉండాలని దేవి ఎడ్యూకేషనల్ సొసైటీ ఫౌండర్ మల్లిపూడి మిత్ర అన్నారు. సొసైటీ వారిచే నిర్వహిస్తున్న దీక్షా డ్రగ్ ఎడిక్షన్ సెంటర్‌వారిచే సోమవారం స్థానిక ఆంగ్లో ఇండియన్ స్కూల్‌లో మత్తు మందులకు దూరంగా ఉండాలని, వ్యసనాలను మానుకోవాలని కోరుతూ అవగాహన కార్యక్రమం జరిగింది. మిత్ర మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మత్తు మందులు, వ్యసనాల భారీనపడకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. వ్యసనాలు వల్ల జీవితాలు, కుటుంబాలు నాశనం అవుతాయని హెచ్చరించారు. నల్లమందు, హెరాయిన్ వంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడకూడదని, ఆ విషయాన్ని గ్రహించాలని తెలిపారు. భారత ప్రభుత్వం మత్తు రహిత భారత్‌ను నిర్మించాలని చూస్తుందని వెల్లడించారు. మత్తు మందులు స్వీకరించకూడదని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గురజాడ మల్లిక, దేవి సొసైటీ సభ్యులు కృష్ణ, హర్షవర్ధన్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం కడకట్ల పరిధిలో సోమవారం వెక్టార్ హైజీన్ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలనచేశారు. అవగాహన ర్యాలీలు నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, వాటిని నియంత్రించాల్సిన ప్రాధాన్యతను ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. దోమలు సమాజానికి ప్రథమ శత్రువులని, వాటి నియంత్రణకు ప్రతి శుక్రవారం పట్టణంలో డ్రైడే జరగాలన్నారు. దోమ లార్వాను గుర్తించడంలో హెల్త్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు చంద్రకళ, ఆశా అనురాధ, ఆరోగ్య సహాయకులు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి



ఏరియా ఆసుపత్రి వద్ద కార్మికుల ఆందోళన

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏరియా ఆస్పత్రి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఇవ్వాల్సిన మూడు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతు ఏఐటీయూసీ అనుబంధ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఏరియా ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఆస్పత్రిలో సెక్యూరిటీ, శానిటేషన్ విభాగాల్లో పని చేస్తున్న సిబ్బందికి గత మూడునెలలుగా కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు ఆస్పత్రి గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బకాయి వేతనాలు చెల్లించాలని, పీఎఫ్ బకాయిలు, ఈపీఎఫ్ సంస్థకు వెంటనే జమ చేయాలని, పెరిగిన పని భారానికి అనుగుణంగా సిబ్బంది సంఖ్యను పెంచాలని కోరారు. నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా కమిటీ అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు, కార్యదర్శి మండలపర్తి హరీష్, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, కార్మికులు తదితరులు హాజరై మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎవీఆర్ఎస్ తాతారావుకు వినతిపత్రం అందజేశారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

పెంటపాడు: ఈనెల 16 నుంచి సెప్టెంబర్ 18 వరకు మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గ్రామంలో భూములకు సంబంధించి అన్ని సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా ఈ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో అన్ని గ్రామ సచివాలయాల్లో ఈ సభలు జరుగుతాయన్నారు. ఈ సభలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 17న అలంపురం-1,2 సచివాలయాలు, 20న ఆకుతీగపాడు, బోడపాడు, 21న బి. కొండేపాడు, 22న దర్శిపర్రు, 23న జట్లపాలెం, 24న మౌంజీపాడు, ఉమామహేశ్వరం, 27న కె. పెంటపాడు, 30న కోరిమిల్లి, చింతపల్లి, 31న మీనవిల్లూరు, రామచంద్రపురం, సెప్టెంబర్ 3న ముదునూరు, 4న పడమరవిప్పర్రు, 5న రావిపాడు, 6న పరిమెళ్ల, 10న రాచర్ల, 11న వల్లూరుపల్లి,12న పెంటపాడు-1, 13న పెంటపాడు-2, 17న పెంటపాడు-3, 18న ప్రత్తిపాడు గ్రామ సచివాలయాల్లో జరిగే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

లైంగిక వేధింపులపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాలకోడేరు: మహిళలు పనిచేసే ప్రదేశంలో లైంగిక వేధింపులను అరికట్టడంపై సోమవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి ఆధ్వర్యంలో మోగల్లు సచివాలయంలోని మహిళా ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం పురుషులతోపాటు మహిళలు కూడా ప్రతి రంగంలో ముందుంటున్నారని, ఆ క్రమంలో మహిళలు పనిచేసే ప్రదేశాలలో చాలామంది లైంగిక వేధింపులకు గురవుతున్నారని, లైంగిక వేధింపులు అరికట్టాలంటే ప్రతి ఒక్క మహిళ చైతన్యం కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా ఎవరైనా పని చేసే చోట మహిళలను లైంగికంగా వేధించడం గాని, అనవసరంగా తాకటం గానీ చేసినట్లయితే తోటి మహిళా ఉద్యోగులకు గాని, ఉన్నతాధికారుల దృష్టికి గాని తీసుకుని వెళ్లి వారికి తగిన గుణపాఠం చెప్పవచ్చన్నారు. తమకు జరిగిన అన్యాయాన్ని ఎవరికి చెప్పకపోవడం వల్ల నిందితులు మరింత రెచ్చిపోయే ప్రమాదం ఉందన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వపరంగా పలు రకాలైన చట్టాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ భయపడకుండా తమ పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే తోటి మహిళా ఉద్యోగులకు తెలియజేసి తమ హక్కులను కాపాడుకోవాలని తెలియజేశారు. సచివాలయ మహిళా ఉద్యోగులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల బలోపేతానికి శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఎల్‌పీవో బాలాజీ, పాల్గొన్న సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు

తాడేపల్లిగూడెం రూరల్: స్థానిక సంస్థల బలోపేతానికి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జ్ డీఎల్‌పీవో బాలాజీ తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ పాలనపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డీఎల్‌పీవో బాలాజీ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్లాస్టిక్ నివారణపై చర్యలు చేపట్టాలన్నారు. ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. పంచాయతీ కార్యదర్శుల విధులు, సుస్థిర అభివృద్ధి కోసం చేట్టాల్సిన పనులు గురించి వివరించారు. మంచి నీటి సరఫరా, క్లీన్ అండ్ గ్రీన్ అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో ఎస్.సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ ఘన వ్యర్థాల నుంచి సంపద సృష్టి, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను నిర్వహణలోకి తీసుకురావడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ ప్రణాళికను ఏర్పాటు చేసుకుని, వాటిలోని లోపాలపై పునఃసమీక్ష చేసుకోవాలన్నారు. శిక్షణ రెండవ రోజు క్షేత్ర స్థాయిలో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాల సందర్శన, మూడవ రోజు పరీక్షలు నిర్వహించడం, ఫీడ్ బ్యాక్ తీసుకుంటామన్నారు. భాగస్వామ్య వాతావరణంలో ఈ శిక్షణ జరుగుతుందన్నారు. అనంతరం మాస్టర్ ట్రయినీ రవిచంద్ర ఎల్ఈడీ స్కీమ్స్‌పై శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పి.శేషులత, మండలంలోని 27 గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలి



తణుకులో కరపత్రాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు అర్బన్: తణుకు పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రజలతోపాటు సమాజంలో అన్ని సంస్థలు భాగస్వామ్యం కావాలని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకు మునిసిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తడి, పొడి చెత్త సేకరణలో ప్రజలు సహకరిస్తున్నారని, ముఖ్యంగా డ్రెయినేజీల్లో పూడిక తీస్తుంటే అధికశాతం ప్లాస్టిక్ వ్యర్థాలైన గ్లాసులు, వాటర్ బాటిల్స్ వంటివి వస్తున్నాయని వ్యాపారులు, ప్రజలు పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలని కోరారు. పట్టణ పరిధిలో ఉన్న 30,500 ఇళ్లకు సంబంధించి 45వేల మెట్రిక్ టన్నుల చెత్తను కేవలం 180 మంది పారిశుద్ధ్య సిబ్బంది సేకరిస్తున్నారని కంపోస్టుకు తరలిస్తున్నారని వారి కష్టాన్ని కూడా గుర్తించి తణుకు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్, డిప్యూటీ కలెక్టర్ బీవీ రమణ, మాజీ మునిసిపల్ చైర్మన్‌లు పరిమి వెంకన్నబాబు, డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బసవ రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు కలగర వెంకటకృష్ణ, జనసేన పట్టణ అధ్యక్షుడు కొమ్మిరెడ్డి శ్రీనివాసు, వ్యాపారులు, వివిధ సంస్థల నాయకులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరంలో నిర్వహించే జిల్లా స్థాయి స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లను ఇన్‌చార్జి ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్ సోమవారం పరిశీలించారు. కలెక్టర్ కార్యాలయం ఆవరణలో 78వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని ప్రధాన వేదిక, ప్రముఖులు కూర్చునే ప్రదేశాలు, స్వాతంత్ర సమరయోధుల వేదికలను ఆర్డీవో పరిశీలించారు. వేదిక వద్ద జరుగుచున్న పోలీస్ కవాతు రిహార్సిల్స్ కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు నిర్వాహకులు, అధికారులకు ఆర్డీఓ పలు సూచనలు చేశారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం సీజన్ కారణంగా వర్షాలు వచ్చే అవకాశం ఉంటుందని, వాటర్ ప్రూఫ్ టెంట్లను సిద్ధం చేయాలని సూచించారు. సీటింగ్, తాగునీటి ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. భీమవరం తహసీల్దార్ రావి రాంబాబు, ఆర్ఐ కె.రాఘవమూర్తిరాజా, వీఆర్వో యాకోబు, ఈవెంట్ ఆర్గనైజర్ శేఖర్ ఉన్నారు.

కృష్ణాష్టమి వేడుకల అనుమతికి వినతి

భీమవరం: త్రైత సిద్ధాంతం- ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక భీమవరం కమిటీ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించుకోడానికి అనుమతించాలని భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజును కోరారు. కమిటీ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ సోమవారం సీఐ నాగరాజును కలిసి ఈ నెల 26 నుంచి మూడు రోజులుపాటు పట్టణ పరిధిలోని నరసయ్య అగ్రహారంలోని ఆంజనేయస్వామి గుడి ఎదురుగా వేడుకలు నిర్వహించుకోడానికి అనుమతి కోరారు. ఈ కార్యక్రమంలో జ్ఞాన వేదిక సభ్యులు నాగేశ్వరరావు, వాసుదేవా, చక్రధరరావు, తారకేశ్వరి, సుజాత, సత్యనారాయణ తదితరులున్నారు.